

విద్యార్థులకు ఉచిత ప్రయాణం

బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరికొన్ని రోజుల్లో ఎస్ఎస్ఎల్సీ, ద్వితీయ పీయూసీ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు వీలుగా ఆర్టీసీ బస్సుల్లో హాల్ టిక్కెట్ చూపించి ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించేలా ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో మార్చి 1 నుంచి ద్వితీయ పీయూసీ పరీక్షలు, అలాగే మార్చి 21 నుంచి ఎస్ఎస్ఎల్సీ వార్షిక పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులకు ఉచిత ప్రయాణానికి సంబంధించి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.


రథాన్ని లాగుతున్న భక్తులు

కన్నుల పండువగా మల్లేశ్వరస్వామి రథోత్సవం

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తాలుకాలోని మోకా గ్రామంలో మోకా మల్లేశ్వర స్వామి మహా రథోత్సవం బుధవారం కన్నుపండువగా సాగింది. దేవస్థానం నుంచి ఎదురు బసవన్న దేవస్థానం వరకు భక్తుల ఆధ్వర్యంలో హరహర శంభో అంటూ భక్తులు రథాన్ని లాగారు. ఉదయం స్వామివారికి గంగాజలాభిషేకం, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీమంత్రి శ్రీరాములు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ నాయుడు, పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని రథాన్ని లాగారు. రథోత్సవానికి మోకా చుట్టుపక్కల గ్రామాలతో పాటు బళ్లారి, హోస్పేట, ఆంధ్రలోని ఉరవకొండ, విడపనకల్లు, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రుద్రప్ప, బళ్లారి ఇన్‌స్పెక్టర్ సతీష్, ఎస్ఐలు కాళింగ, నాగభూషణ, పోలీసు సిబ్బంది బందోబస్తు పర్యవేక్షించారు.


మల్లేశ్వరస్వామి దర్శనానికి వెళుతున్న మాజీమంత్రి శ్రీరాములు

పాల ధర పెంచుతారా..?

- నందిని పాలు.. లీటర్ రూ.5 పెరిగే అవకాశం
- పాల సమాఖ్యల నుంచి డిమాండ్



బెంగళూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నందిని బ్రాండ్ పాల ధర పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాష్ట్ర బడ్జెట్ సమర్పించిన వెంటనే కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కేఎంఎఫ్) కూడా పాల ధర పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. కనీసం లీటరుకు రూ.5 వరకు పెరిగే అవకాశం ఉందని సమాఖ్య వర్గాల ద్వారా తెలుస్తోంది. మార్చి 7న ముఖ్యమంత్రి సిద్దరామయ్య బడ్జెట్ సమర్పించనున్నారు. ఆ వెంటనే పాలధర లీటరుకు రూ.5 పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే బీఎంటీసీ, కేఎస్ఆర్టీసీ బస్సు చార్జీలు, నమ్మ మెట్రో చార్జీలు పెరిగిన విషయం విదితమే. తాజాగా రాష్ట్రంలోని వివిధ పాల సమాఖ్యలనుంచి ఒత్తిడి పెరగడంతో పాలధరను కనీసంగా లీటరుకు రూ.5 పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. జనవరిలో రాష్ట్రంలోని 16 పాల సమాఖ్యల అధ్యక్షులు, డైరెక్టర్‌లు, ఎండీలు, కేఎంఎఫ్ ప్రతినిధులతో పశుసంవర్ధకశాఖ మంత్రి కే వెంకటేశ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పశుదాణా, కూలీ, విద్యుత్ ఇతర వాటిపై ఖర్చులను ప్రస్తావిస్తూ పాలధర పెంచాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర బడ్జెట్ 2025 అనంతరం ఈ అంశాన్ని పరిశీలించి పెంచుతామని మంత్రి భరోసా ఇచ్చారు. 2023 ఆగస్టులో పాలధరను రూ.3 పెంచగా లీటరు పాలు (బ్లూ ప్యాకెట్) 42గా ఉండేది. 2024 జూన్‌లో మరో రూ.2 పెంచడంతో రూ.44కు చేరింది. తాజాగా పాలధర పెంపు అంశం తెరపైకి రావడంతో సర్వత్రా చర్చనీయాంశమైంది.

3 నుంచి శాసనసభ సమావేశాలు



బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర 16వ శాసనసభకు సంబంధించి ఆరో సమావేశాలకు కార్యక్రమ వేళాపట్టి సిద్ధమైంది. ఇందుకు సంబంధించి శాసనసభ కార్యదర్శి విశాలాక్షి ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చి 3న సోమవారం ఉదయం 11 గంటలకు ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ప్రసంగించనున్నారు. మార్చి 7న శాసనసభ బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి హోదాలో సీఎం సిద్దరామయ్య ప్రవేశపెట్టనున్నారు. అనంతరం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలపడం, బడ్జెట్‌పై చర్చలకు సంబంధించి సమావేశాలు జరగనున్నాయి. అనంతరం మార్చి 8, 9, 15, 16 తేదీలలో వారాంతంలో ఎటువంటి కార్యకలాపాలు ఉండవని పేర్కొన్నారు. కాగా మార్చి 21వరకు కలాపాలు కొనసాగుతాయని మార్పులు చేర్పులు ఏమైనా ఉంటే తదుపరి వివరాలను సభ్యులకు తెలియచేస్తామని ఆమె పేర్కొన్నారు.

కుంగిన భవంతి

బెంగళూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నగరంలో గత ఏడాది బాబుసాపాళ్యలో నిర్మాణదశలో ఉన్న ఇల్లు కూలిన ఘటనలో 8మంది కార్మికులు మృతి చెందిన సంఘటన ఇంకా చెదరకముందే నగరంలో మరొక భవనం ఒరిగిపోయింది. పక్కనే ఉన్న భవనానికి పునాది తీస్తున్న వేళ రెండు అంతస్తుల భవనం కూలింది. జీవనబీమానగర్ పరిధిలోని న్యూ తిప్పసంద్ర ఒకటో క్రాస్ ఆంజనేయస్వామి దేవస్థానం సమీపాన బుధవారం సాయంత్రం ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో విళక్కు హ్యాండిక్రాఫ్ట్‌స్టోర్ పూర్తిగా దెబ్బతింది. శబ్దం కారణంగా ఇంట్లోనివారు బయటకు పరుగులుతీశారు. బేస్‌మెంట్‌లో ఉన్న ఐదు బైక్‌లు దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. భవనం కుంగినవేళ ఆరుమంది ఉండగా వారంతా ప్రాణాలతో బయటపడ్డారు. భవనం ఎప్పుడైనా పూర్తిగా కూలిపోయే అవకాశం ఉండడంతో సమీప భవనాలలో వారిని ఖాళీ చేయించారు. అశాస్త్రీయంగా పునాదులు తీయడంతోనే సమస్య ఏర్పడినట్టు తెలుస్తోంది. పాలికె ప్రాంతీయ జాయింట్ కమిషనర్ సరోజ, చీఫ్ ఇంజనీర్ సుగుణా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పరిశీలించారు. కాగా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రాత్రికి భవనాన్ని పూర్తిగా తొలగించాలని అధికారులు తీర్మానించినట్టు తెలుస్తోంది.


న్యూ తిప్పసంద్రంలో కుంగిన భవనం

చెరువుల.. ఆక్రమణ..!

- రాష్ట్రంలో ఆక్రమణకు గురైన 12 వేల చెరువులు
- స్థితిగతులపై సర్వే చేపట్టిన ప్రభుత్వం
- డిజిటలీకరణకు చర్యలు



బెంగళూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జలవనరుల కొరత లేదు. కావేరి, శరావతి నదులకు అనుబంధంగాను, పశ్చిమ కనుమల ప్రాంతాలలోనూ వందలాది చెరువులు ఉన్నాయి. ప్రత్యేకించి బెంగళూరులోనే ఒకప్పుడు వెయ్యికిపైగా చెరువులు ఉండగా ప్రస్తుతం 837 ఉన్నాయి. వీటిలో 730 చెరువులు ఆక్రమణకు గురైనట్టు తెలుస్తోంది. రాజధాని బెంగళూరు నగరంలోనే ఇంతటి తీవ్రమైన సమస్య ఉన్న తరుణంలో ప్రభుత్వం స్పందించి బెంగళూరుతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల స్థితిగతులపై సర్వేకు ఆదేశించింది. ఇందుకు కర్ణాటక ట్యాంక్ కన్సర్వేషన్ అండ్ డెవలెప్‌మెంట్ అథారిటీ (కేటీసీడీఏ) అన్ని చర్యలు చేపట్టింది. సర్వేశాఖ కమిషనర్ జి.మంజునాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 42వేల చెరువులకుగాను ఇప్పటికే 31వేల చెరువుల సర్వే ప్రక్రియ ముగిసిందన్నారు. మిగిలిన 11వేల చెరువుల సర్వేను పూర్తి చేసి రికార్డులను డిజిటలీకరణ చేయనున్నట్టు తెలిపారు.

డ్రోన్ విధానంతో సర్వే..

ఇదివరకు పాత పద్ధతుల్లో సర్వే చేపడుతున్న కారణంగా ఆక్రమణలను గుర్తించడం ఆలస్యమయ్యేది. దీంతో భూకబ్జాదారులు దర్జాగా తమ దందా కొనసాగిస్తున్నారు. వీటిని ప్రశ్నించేందుకు అధికారులు నానా కసరత్తు చేయాల్సి వచ్చేది. స్టే తేవడం ఒక సవాల్‌గా ఉండేది. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేలా ఆధునిక సాంకేతిక విధానాలైన డ్రోన్ తరహా రోవర్‌లను సర్వేకు ఉపయోగిస్తున్నారు. తద్వారా సరిహద్దులు గుర్తించడం ఒకింత సులభతరంగా మారుతుంది. రాష్ట్రంలో 42వేల చెరువులకుగాను 12వేల చెరువులు వివిధ ప్రాంతాల్లో ఆక్రమణకు గురైనట్టు గుర్తించారు. చెరువుల హద్దులను స్పష్టంగా గుర్తించి రికార్డులను డిజిటలీకరణ చేసి ప్రభుత్వానికి నివేదిక పంపేందుకు సర్వేశాఖ తీవ్ర కసరత్తు చేస్తోంది. పాత రికార్డుల సర్వే నెంబర్లతో పాటు కొత్తగా ఉన్న వివరాలను పొందుపరచనున్నారు.

ఆక్రమణల తొలగింపులో నిర్లక్ష్యం

ఎంతో కష్టపడి చెరువుల హద్దులను గుర్తించి స్థితిగతులను పొందుపరిచి ఆక్రమణకు గురైనట్టు సర్వేశాఖ వెల్లడిస్తున్నా వాటిని తొలగించడంలో ఇతరశాఖ అధికారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. స్థానిక నాయకులు, అధికారుల సహకారం లేకుండా ఆక్రమణలు తొలగించలేమని పలువురు అధికారులు చెబుతున్నట్లు తెలుస్తోంది.

రికార్డుల కొరత

రాష్ట్రంలో వంద ఎకరాలకంటే తక్కువ విస్తీర్ణం ఉండే చెరువులు స్థానిక సంస్థల పరిధిలోకి వస్తాయి. అంతకంటే ఎక్కువ విస్తీర్ణం ఉంటే చిన్ననీటి పారుదలశాఖ పరిధిలోకి చేరుతాయి. అయితే రాష్ట్రంలో వేలాది చెరువులు ఉన్నా వాటికి సరైన రికార్డులు లేకపోవడంతో వాటి సంరక్షణ సవాల్‌గా మారుతోందని అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగా పలుచోట్ల చెరువులు మాయం అయ్యాయి. కొన్నిచోట్ల వాటి ఆనవాళ్లకు సంబంధించి రికార్డులు ఉన్నా సమగ్రత కొరవడింది. ఇలా చెరువుల ఆక్రమణ అంశం రాష్ట్ర అధికారులకు సవాల్‌గా మారింది. వీటిలో బీబీఎంపీలో 202 చెరువులకుగాను 159 చెరువులు కొంతమేర ఆక్రమణకు గురైనట్టు గుర్తించారు. ఆధునిక రోవర్ విధానంలో సర్వేశాఖ సమీక్ష చేపట్టింది. చెరువుల చుట్టూ 30 మీటర్ల మేర బఫర్‌జోన్‌గా గుర్తించి రికార్డులు సిద్ధం చేస్తోంది.

జిల్లాలవారీ సమాచారం

జిల్లా పేరు	చెరువులు	ఆక్రమణకు గురైనవి
హాసన్	6,902	1,534
శివమొగ్గ	4,835	1,240
మైసూరు	2,991	1,506
కోలారు	2,520	807
తుమకూరు	2,061	608
ఉత్తరకన్నడ	2,118	448
బెంగళూరు నగర	837	730
బెంగళూరు గ్రామీణ	710	643
మండ్య	962	448

రోవర్ టెక్నాలజీ ప్రత్యేకత

చెరువుతోపాటు పలురకాల భూములకు సంబంధించి పాత కొలతల పద్ధతులకు బదులు డ్రోన్ ద్వారా ఫొటోలు తీసి ఖచ్చితమైన సరిహద్దులను గుర్తించడమే రోవర్ టెక్నాలజీ ప్రత్యేకత. 120 మీటర్ల ఎత్తునుంచి డ్రోన్ కెమెరా ద్వారా ఫొటోలు తీసి, వాటికి జీపీఎస్ ఆధారంగా కోడ్ స్టేషన్ మాదిరి సరిహద్దులను గుర్తిస్తారు. తద్వారా నాలుగువైపులా ఉన్న హద్దులను నమోదు చేసి రికార్డులను డిజిటలీకరణ చేస్తారు. ఏడాదిగా సాగుతున్న ప్రక్రియ మరికొన్ని నెలల్లో పూర్తి కానుందని అధికారులు చెబుతున్నారు.

అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వండి

- కన్నడ తాలూకా సాహిత్య సమ్మేళనం అధ్యక్షుడు శాంతమూర్తి

బాగేపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సరిహద్దులో వెనుకబడిన ప్రాంతమైన బాగేపల్లి తాలూకా అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని కన్నడ సాహిత్య సమ్మేళన అధ్యక్షుడు శాంతమూర్తి పిలుపునిచ్చారు. తాలూకా కేంద్రమైన బాగేపల్లిలో ఏడో తాలూకా కన్నడ సాహిత్యసమ్మేళనం బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని డీవీజీ మెయిన్‌రోడ్డుపై కన్నడమాత భువనేశ్వరి దేవి, సమ్మేళన అధ్యక్షుడు ఎస్ శాంతమూర్తిని కన్నడ బావుటాల నడుమ ఊరేగించారు. పట్టణంలోని బాలికల పాఠశాల మైదానంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శాంతమూర్తి మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతమైన తాలూకాలో పరిశ్రమలు ఏర్పాటు, యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని తద్వారా వలసపోకుండా అడ్డుకట్ట వేయాలన్నారు. సాగు, కూరగాయలు పండించేందుకు శాశ్వత నీటి పథకాలు కల్పించాలని, రోడ్ల సదుపాయం మెరుగు చేయడంతోపాటు రైల్వే స్టేషన్ వ్యవస్థ కల్పించాలన్నారు. అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా రైతులు, యువత ప్రశాంతంగా గడపగలరన్నారు. వివిధ శాఖలు అమలు చేస్తున్న పథకాల గురించి అవగాహన కల్పించాలని, ఉద్యోగ మేళా నిర్వహించాలని, కార్మికులు, విద్యార్థులకు నైపుణ్య తరగతుల శిబిరాలు నిర్వహించాలన్నారు. ఇప్పటికే ఉమ్మడి కుటుంబాలు తగ్గాయని, పరిస్థితి ఇలాగే కొనసాగితే పెద్దలు, నేటి తరానికి నడుమ అగాథం ఏర్పడుతుందని, మన సంస్కృతి సంప్రదాయాల వైభవానికి పరిరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ధార్మిక, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల ప్రాముఖ్యతను నేటి తరానికి తెలియచేయాలన్నారు. కన్నడ సాహిత్యం కేవలం కవిత్వం, నవలలకే పరిమితం కారాదని, స్త్రీ, శిశు, విప్లవ, ఆరోగ్య, ఆర్థిక, చట్ట, పత్రికా సాహిత్యాలకు బాటలు వేయాలన్నారు. పరభాషా వ్యామోహంలో కన్నడ సాహిత్య విలువలను విస్మరించరాదన్నారు. కన్నడలో మాట్లాడండి, వ్యవహారాలు చేయండి అలాగే ఇతర భాషలను గౌరవించండన్నారు. సాహిత్యమే అన్ని విలువలకు తల్లిలాంటిదన్నారు. సరిహద్దు ప్రాంతం కావడంతో తెలుగు మాట్లాడేవారు ఉన్నా కన్నడ భాష, కళలు, సాహిత్య కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగడం అభినందనీయమన్నారు. జాతీయబ్యాంకులు, కంపెనీలలో కన్నడిగులకు ఎక్కువ ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. అన్నివర్గాల ప్రజలకు సదుపాయాలు లభించాలన్నారు.

కన్నడ పట్ల చిన్నచూపు వద్దు : ఎమ్మెల్యే

ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి ప్రసంగిస్తూ సరిహద్దు కావడంతో తెలుగు మాట్లాడే ప్రభావం ఉన్నా కన్నడ అభిమానానికి కొరత లేదన్నారు. కన్నడపట్ల చిన్నచూపు వద్దన్నారు. కన్నడ రాష్ట్ర ఏకీకరణలో రాజులు, మహారాజులు, సాధువులు, కవులు, సాహితీవేత్తలు కన్నడ సాహిత్యానికి ఎంతో కృషి చేశారన్నారు. కన్నడలో చదివి ఐఏఎస్, ఐపీఎస్, కేఏఎస్ వంటి హోదాలు పొందినవారు ఉన్నారన్నారు. కన్నడ


కన్నడ పతాకాలతో ర్యాలీ

వ్యాకరణం, అక్షరమాల, కన్నడ పదాలను స్పష్టంగా మాట్లాడడం నేర్చుకోవాలన్నారు. జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ కోడిరంగప్ప మాట్లాడుతూ సాహిత్యంలో ఎక్కువ జ్ఞానపీఠ పురస్కారాలు లభించింది కన్నడభాషకే అన్నారు. చిక్కబళ్లాపుర జిల్లాలో డాక్టర్ హెచ్ నరసింహయ్య, డాక్టర్ యూఆర్ రావ్, డాక్టర్ జచని, వీరభద్రచన్నమల్ల స్వామీజీ, కైవార నారాయణప్ప వంటి మహనీయులు జన్మించారన్నారు. ప్రతి ఒక్కరూ విశ్వమానవుడి సందేశం అలవరచుకోవాలన్నారు.

తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు డీఎన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతంలో కన్నడ సాహిత్య సమ్మేళనాలు నిర్వహించేందుకు కొరత లేదన్నారు. అయితే ప్రభుత్వ గ్రాంట్లు తగినంత లేకున్నా వాటిని అమలు చేసేందుకు ఎమ్మెల్యే, ఇతర అధికారులు ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. కార్యక్రమానికి ముందుగా బాలికల పాఠశాల ఆవరణలో ప్రభుత్వ పాఠశాలలు, నేషనల్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థుల బ్యాండ్ కవాతు ఆకట్టుకుంది. తహసీల్దారు మనీషా ఎన్ పత్రి జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. బీఈఓ ఎన్ వెంకటేశప్ప నాడధ్వజాన్ని, తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి పరిషత్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధరంగాల సాధకులకు, కన్నడ పోరాట నేతలకు, కన్నడ భాషలో ఎక్కువమార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ప్రభుత్వ హైస్కూల్ సంగీత ఉపాధ్యాయులు కీర్తి బసప్ప లగళి నేతృత్వంలో సాంస్కృతిక ప్రదర్శనలు, కన్నడ నృత్యాలు సభికులను అలరించాయి. కాగా తాలూకాలోని ఘంటంవారిపల్లి గ్రామపంచాయతీ నుంచి కన్నడ జెండాలు, తోరణాలతో ముస్తాబు చేసిన ఎడ్లబండ్ల ఊరేగింపు అలరించింది. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ వర్ణి, బీఈఓ ఎస్ వెంకటేశప్ప, తాజా మాజీ సమ్మేళన అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, పురసభ ముఖ్యాధికారి శ్రీనివాస్, అధ్యక్షుడు ఏ శ్రీనివాస్, బీఆర్‌సీ సమన్వయాధికారి వెంకటరామప్ప, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్ హనుమంతరెడ్డి, తాలూకా ఆరోగ్యాధికారి డి.ఎన్.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న సంస్థల ప్రతినిధులు

ఏఐ సాంకేతికతకు అనుగుణంగా కోర్సులు

బెంగళూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఏఐ సాంకేతికతకు అనుగుణమైన కోర్సుల అవసరం ఉందని, ఇందులో భాగంగా ఎంబీఏ టెక్నో మేనేజ్‌మెంట్ కోర్సు ప్రస్తుత ఏఐ యుగానికి బాటలు వేయనుందని సీఎంఆర్ యూనివర్సిటీ, సీఎంఆర్ విద్యాసంస్థల గ్రూప్ అధ్యక్షుడు డాక్టర్ కేసీ రామమూర్తి అన్నారు. నగరంలో బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో అమెరికాకు చెందిన ప్రాడక్ట్ లీడర్‌షిప్ ఇంక్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. ప్రాడక్ట్ లీడర్‌షిప్ సీఈఓ అండ్ ప్రాడక్ట్ ఆఫీసర్ సాయిసతీశ్ వేదం మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక దిశగా ప్రగతి సాధించేందుకు సరికొత్త కోర్సులు ప్రవేశపెట్టేందుకు సీఎంఆర్ యూనివర్సిటీ ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. సీఎంఆర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ హెచ్‌బీ రాఘవేంద్ర మాట్లాడుతూ ఆధునికతను కోరుకునే యువత అభిరుచికి అనుగుణంగా సరికొత్త కోర్సులు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఇందుకు అవసరమయ్యే సాంకేతికత విధానాలను ప్రాడక్ట్ లీడర్‌షిప్ సంస్థ సమకూర్చనుందన్నారు. ప్రపంచంలో ఎక్కువమంది ఇంజనీర్లు భారత్‌లో ఉన్నారని అయితే టెక్నో బిజినెస్ లీడర్‌ల కొరతను అధిగమించేందుకు ఎంబీఏ తప్పనిసరి కానుందన్నారు. ఇందుకు తమ కోర్సు ఎంతగానో దోహదపడనుందని డిలైట్ లూప్ ఫౌండర్ అండ్ సీఈఓ పింకేశ్ శా అన్నారు. సమావేశంలో స్విగ్గి ఉపాధ్యక్షుడు, ముఖ్యులు తపోజాయ్ చటర్జీ, ఊబర్ ప్రాడక్ట్ హెడ్ అదితి సంపత్, గ్లోబల్ లాజిక్ ఉపాధ్యక్షుడు ఆశిష్ కల్పకోటిలు తమ ప్రసంగాలలో యువ బిజినెస్ మేనేజర్‌ల ఆవశ్యకత, నైపుణ్యం గురించి ప్రస్తావించారు.

సౌకర్యాలు కల్పించకపోతే చర్యలు

రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ హెచ్చరిక


ధాన్యపు గిడ్డంగిని తనిఖీ చేస్తున్న చైర్మన్

8

మళ్లీ దెబ్బ..!

రైల్వేలైన్ కోసం భూసేకరణ


బైసాప్ లైన్ కోసం సేకరించనున్న భూమి

- ఇది వరకే ఓ ట్రాక్ నిర్మాణం
- రెండింటి మధ్య మిగలనున్న భూమి
- తీవ్ర నష్టం అంటున్న బాధిత రైతులు

గుంతకల్లు, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): రైల్వే బైపాస్ లైన్ కోసం భూమిని కోల్పోతున్న పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముంబై రూటు నుంచి వచ్చే గూడ్సు రైళ్ల గుంతకల్లు రైల్వే స్టేషన్‌లోకి రాకుండా బైపాస్ గుండా విజయవాడ లైన్‌లోకి వెళ్లేలా చేయడానికి ట్రాక్ నిర్మాణానికి అధికారులు భూసేకరణ చేపట్టారు. గుంతకల్లు స్టేషన్‌లో విజయవాడ రైళ్లకు ఇంజన్‌ను మార్చనవసరం లేకుండా చేయడానికి ఇదివరకే ఓ బైపాస్ లైన్‌ను నిర్మించారు. ఆ లైన్ కోసం కసాపురం, గుంతకల్లు రైతులు గతంలో భూములను రైల్వేకు ఇచ్చారు. ఇప్పుడు మరలా పాత లైన్‌కు కొద్ది దూరంలో ఇంకో బైపాస్ లైన్‌ను నిర్మించడానికి రైల్వే అధికారులు తలపెట్టారు. ఇప్పుడు కూడా గతంలో భూములు కోల్పోయిన రైతుల భూములే పోతున్నాయి. దీంతో పాత లైన్‌కు ఆనుకుని కాకుండా కొద్ది దూరంలో ట్రాక్ నిర్మించడం వల్ల అంటే రెండు ట్రాక్‌ల మధ్య కొంత భూమి మిగిలిపోతుందని, ఇది ఎందుకూ పనికి రాకుండా పోయే ప్రమాదం ఉందని ఆయా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే లైన్‌ను నిర్మిస్తే రైలు వంతెనలు, వ్యవసాయ పైపు లైన్ల విషయంగా ఆ శాఖ నుంచి శాశ్వతంగా సమస్యలు ఎదురవుతూనే ఉంటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పాత బైపాస్‌లైన్‌పై నిర్మించిన వంతెన వల్ల తమకు ఎంతో ఇబ్బంది ఉందని, కానీ రైల్వే అధికారులు తమ కష్టాలు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

56 ఎకరాల కోసం సర్వే

గుంతకల్లు-ముంబై లైన్‌లో మొదటి రైల్వే స్టేషన్ అయిన వెస్ట్ గుంతకల్లు వద్ద నుంచి విజయవాడ వైపు నంచెర్ల రైల్వే స్టేషన్ వరకూ రెండో బైపాస్ లైన్ నిర్మాణానికి గత ఏడాది రైల్వే అధికారులు సర్వేచేసి, తమకు కావాల్సిన భూమిలో రాళ్లను పాతారు. యాభైమంది రైతులకు చెందిన 55.8 ఎకరాల భూమిని సేకరించడానికి రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి పంపారు. ఈ మేరకు స్థానిక డివిజనల్ రెవెన్యూ అధికారి శ్రీనివాసులు గత వారంలో రైతులను పిలిపించి చ ర్చించారు. భూమిని కోల్పోనున్న రైతులు తమ అభ్యంతరాలను తెలిపారు. భూములకు బుక్ వ్యాల్యూ ప్రకారం లెక్కగడితే మంచి పంటలు పండే నల్ల రేగడి భూములకు తగిన పరిహారాలు రావని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎకరాకు కనీసం రూ. 40 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఏకపక్షంగా లాక్కుంటే ఎలా?

రైల్వే బైసాప్ లైన్ కోసం అధికారులు తమతో ఏమాత్రం చర్చించకుండా ఏకపక్షంగా భూమిని లాక్కుంటున్నారని రైతులు వాపోతున్నారు. గతంలో నిర్మించిన విజయవాడ బైపాస్ లైన్‌కు ఆనుకుని ఇంకో బైపాస్ లైన్‌ను నిర్మిస్తే అనుకూలంగా ఉంటుందని రైతులు తెలిపారు. అలా పక్కనుంచి కాకుండా కాస్త దూరంగా రైల్వే లైన్‌ను నిర్మించడానికి ప్లాన్‌ను సిద్ధం చేశారన్నారు. దీని వల్ల లైన్లకు మధ్య మిగిలిపోయిన భూముల వల్ల రైతులకు చాలా నష్టం కలుగుతుందని, వ్యవసాయం చేయడానికి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయని రైతులు వాపోతున్నారు. అవసరమైతే నీటి పైపులను రైల్వే లైన్ల కింద నుంచి వేసుకోవడానికి రైల్వే శాఖాధికారులు ఏమాత్రం అంగీకరించరని రైతులు తెలియజేస్తున్నారు. పైగా భూసేకరణ చేసిన సర్వే నంబర్లను 08 కింద చూపి సమస్యను తెచ్చిపెడతారన్నారు. మిగిలిన భూమిని అమ్ముకోవాలన్నా, తనఖా పెట్టాలన్నా సాధ్యంకాని పరిస్థితులు ఏర్పడతాయని అనుమానాలను వ్యక్తంచేస్తున్నారు.


రైతులకు సమస్యగా మారిన బైపాస్ లైన్‌లోని రైలు వంతెన

ఎకరాకు రూ. 40 లక్షలు చెల్లించాలి: పూల రమణ, రైతు



బాగా పంటలు పండే నల్ల రేగడి భూములను సేకరిస్తున్నారు. హంద్రీనీవా పక్కనే ఉన్నందున భూముల రేట్లు పెరిగాయి. కానీ పుస్తకాలలో ఉన్న రిజిస్ట్రేషన్ విలువలను లెక్కలోకి తీసుకుని పరిహారాలను ఫిక్స్ చేస్తారు. దీని వల్ల రైతులకు నష్టం వాటిల్లుతుంది. అలాగే రైల్వే శాఖకు ఎంత కావలిస్తే అంతమాత్రమే భూమిని సేకరిస్తే బిట్లు మిగిలిపోయి రైతులు నష్టపోతారు. కనుక రైతులకు ఇబ్బంది లేనివిధంగా బిట్లు మిగలకుండా భూమిని రైల్వే శాఖ కొనాలి.

బైపాస్ లైన్ పక్కనే నిర్మించాలి: కేదార్‌నాథ్ రెడ్డి, రైతు



ఇదివరకే నిర్మించిన బైపాస్ లైన్‌కు ఆనుకుని కొత్త బైపాస్ లైన్‌ను నిర్మించాలి. దీని వల్ల భూమి వృథా కాదు. లేదంటే రైతులకు సమస్యలు తలెత్తుతాయి. అక్కడ కొంచెం.. ఇక్కడ కొంచెం భూమి విడిపోతే వాటికి విలువ కూడా తగ్గిపోతుంది. కనుక రైల్వే అధికారులు ప్లాన్‌ను మార్చి భూమిని సేకరించాలి. రైల్వే లైన్ల కింద ట్రాక్టర్లు, బండ్లు వెళ్లడానికి అనువైన వంతెనలు నిర్మించాలి.

కొనే భూమిని సబ్‌డివిజన్ చేయాలి: వరదరాజులు, రైతు



రైల్వే శాఖ సేకరించే భూమిని సబ్‌డివిజన్ చేసి కొనాలి. లేదంటే డైగ్లాట్‌లో సర్వే నంబర్లు మొత్తం సీజ్ అవుతాయి. దీని వల్ల భవిష్యత్తులో మా భూములను అమ్ముకోలేము. తనఖా పెట్టలేము. కనుక రెవెన్యూ అధికారులు ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని సబ్‌డివిజన్ చేసిన తర్వాత భూమిని సేకరించాలి. గతంలో నిర్మించిన బైపాస్‌లైన్‌లో సరైన వంతెనలు నిర్మించని కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్నాము. ఇప్పుడూ అదే పునరావృతం అవుతుందని ఆందోళన చెందుతున్నాం.

త్వరలో సంప్రదిపులు చేపడతాం: శ్రీనివాసులు, గుంతకల్లు ఆర్డీవో



రైతుల భూములను సర్వేచేసి, అభ్యంతరాలు స్వీకరించాం. రైతుల అభ్యంతరాలపై మినిట్స్‌ను రికార్డు చేసి కలెక్టరేట్‌కు పంపాము. త్వరలో జేసీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సంప్రదింపుల సంఘం (డీఎల్ఎన్‌సీ) ఏర్పాటై రైతులు, రైల్వే అధికారులను పిలిపించి చర్చలు జరుపుతారు. రైతుల అభ్యంతరాలన్నీ తప్పక పరిశీలిస్తాం. కనుక రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. రైతులు వారి వాదలను నేరుగా జిల్లా రెవెన్యూ అధికారులు, రైల్వే అధికారులకు తెలియజేయవచ్చు. భూమి ధర విషయంగా కూడా సంప్రదింపులు జరిపే అవకాశం ఉంటుంది.

నేటి నుంచి

బుగ్గరామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

- సర్వాంగ సుందరంగా ఆలయం ముస్తాబు


స్వామివారి మూలవిరాట్


తాడిపత్రి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమై మార్చి 2వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాలను కనివినీ ఎరుగని రీతిలో జరిపించడానికి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని రంగురంగుల విద్యుత్‌దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 20న శైవపుణ్యావచనం అంకురారోపణం, 21న ధ్వజారోహణం, చిత్రగోపురం, 22న వాసుకీవాహనం, శేషవాహనం, 23న సింహవాహనం, 24న నరమృగవాహనం, 25న గజవాహనం, 26న నందివాహనం, అధికార నంది వాహనంతోపాటు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆకాశదీపోత్సవం, రాత్రి 12గంటలకు లింగోద్భవం, 27న పార్వతీసమేత బుగ్గరామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం, అనంతరం మహారథోత్సవం, 28న అశ్వవాహనం, మార్చి 1న వసంతోత్సవం, హంసవాహనం, 2న ఏకాంతోత్సవం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

చైన్ స్నాచింగ్

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చెరువుకట్ట మీద ద్విచక్రవాహనంపై వస్తున్న మహిళ మెడలో ఉన్న బంగారం చైనును గుర్తుతెలియని దుండగులు లాక్కొని వెళ్లిన సంఘటన బుధవారం జరిగింది. గుత్తి మండలం అప్పేదొడ్డి పల్లి గ్రామానికి చెందిన గోవిందరెడ్డి భార్య కోటేశ్వరమ్మ అనంతపురం రూరల్ పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలోని తన పుట్టింటికి మంగళవారం వచ్చారు. పుట్టింటి వారు వడిబియ్యం పెట్టారు. అనంతరం భర్తతో కలిసి అప్పేదొడ్డిపల్లి గ్రామానికి ద్విచక్రవాహనంపై బుధవారం బయల్దేరారు. బుక్కరాయసముద్రం మీదుగా చెరువుకట్టపై వెళ్తుండగా రెడ్ పల్సర్ ద్విచక్రవాహనంలో ఇద్దరు గుర్తుతెలియని దుండగులు వచ్చి కోటేశ్వరమ్మ మెడలో ఉన్న గొలుసును లాక్కొని పోయారు. దాని బరువు 250 గ్రాములు ఉందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుక్కరాయసముద్రం సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాలలకు అన్యాయం జరిగితే సహించం

రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్


మాట్లాడుతున్న విజయ్‌కుమార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మాల సామాజికవర్గానికి అన్యాయం జరిగితే సహించబోమని రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్ అన్నారు. జిల్లాకొచ్చిన ఆయన ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ సమావేశపు హాల్‌లో మాల సంఘాలు, ఉద్యోగులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో నిర్వీర్యమైపోయిన ఎస్సీ కార్పొరేషన్‌ను పునరుద్ధరిస్తామన్నారు. జీవం పోసి నిరుద్యోగ యువతకు భరోసా కల్పిస్తామన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉండి అన్యాక్రాంతమవుతున్న స్థలాలను కచ్చితంగా కాపాడుతామన్నారు. జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఉన్న స్థలాలను గుర్తించాలన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న భూముల్లో పౌల్ట్రీలు శిథిలమయ్యాయన్నారు. వాటికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎస్సీ వర్గాల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా పర్యటించి అన్ని అంశాలపై లోతైన అధ్యయనం చేస్తున్నామన్నారు. కార్పొరేషన్ కార్యాలయాల్లో ఎస్సీ అభ్యర్థులకు అందిస్తున్న పథకాలు, సేవలపై సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇండస్ట్రియల్ పాలసీలో భాగంగా ఉచిత విద్యుత్‌ను పునరుద్ధరిస్తామన్నారు. సమావేశంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధిక పాల్గొన్నారు.

- రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్ ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లను పరిశీలించారు. టవర్‌క్లాక్, కలెక్టరేట్ సమీపంలో ఉన్న పలు షాపింగ్ కాంప్లెక్స్‌లను పరిశీలించి వాటి వివరాలను ఆరా తీశారు.
- జిల్లాకొచ్చిన రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్ మాల సంఘాల నాయకులు, ఉద్యోగులతో సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి జిల్లా పర్యటనలో తన దృష్టికి వచ్చిన సమస్యలు, ఎస్సీ కార్పొరేషన్ పథకాల తదితర వాటిపై చర్చించారు. ఆయనతో పాటు మాల కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధికలు ఉన్నారు.

ఆదాయం అంతంతే..

- ఏడాదంతా చీనీ విక్రయాలు
- లక్ష టన్నుల కాయల అమ్మకం
- అన్ సీజన్‌లోనూ మార్కెట్‌కు దిగుబడులు
- అయినా తగ్గిన ఆదాయం


మార్కెట్‌కు వచ్చిన చీనీకాయలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అనంత చీనీ మార్కెట్‌లో గతేడాది చీనీ విక్రయాలు జోరుగా సాగాయి. ఏడాదంతా విక్రయాలు జరిగాయి. లక్ష టన్నుల కాయలు విక్రయించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. సీజన్‌తో సంబంధం లేకుండా కాయలు మార్కెట్‌కు రావడం యార్డుకు కొంత కలిసొచ్చింది. అన్ సీజన్‌లో సైతం మార్కెట్‌కు కాయలు వచ్చాయి. ఆదాయం మాత్రం అంతంత మాత్రంగానే రావడం గమనార్హం. సీజన్‌లో ఆశించినస్థాయిలో కాయలు మార్కెట్‌కు రాకపోవడం మార్కెట్ ఆదాయంపై పడింది.

సీజన్‌లో తగ్గినా.. అన్ సీజన్ మార్కెట్‌కు కాయలు..

చీనీ మార్కెట్ సీజన్ జనవరి, ఫిబ్రవరి నుంచి మొదలై సెప్టెంబరు వరకు కొనసాగుతుంది. గతేడాది మార్చిలో 17,909, మే నెలలో 18,116, జూన్‌లో 16,591, జూలైలో 21,482 టన్నుల చీనీ విక్రయాలు జరిగాయి. మిగిలిన నెలల్లో ఆశించిన స్థాయిలో మార్కెట్‌కు చీనీకాయలు రాలేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. 2023 ఏడాదితో పోల్చుకుంటే.. గతేడాది కాయలు తగ్గిపోవడంతో..యార్డు ఆదాయం కొంతవరకు తగ్గినట్లు తెలుస్తోంది. అధికారుల లెక్క ప్రకారం రూ.6 లక్షల నుంచి రూ.7లక్షల మేర ఆదాయం తగ్గినట్లు చెబుతున్నారు. అన్ సీజన్‌లో కాయలు రావడం మార్కెట్ యార్డుకు కొంత వరకు కలిసొచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో చీనీకి అన్ సీజన్. ఈసారి ఈ మూడు నెలల్లోనూ మార్కెట్‌కు కాయలు వచ్చాయి. 2,295 టన్నుల కాయలు అన్‌సీజన్‌లో మార్కెట్‌కు వచ్చాయి. దీంతో రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చిందంటున్నారు.

యార్డుకు రూ.1.67 కోట్ల ఆదాయం..

గడిచిన ఏడాది చీనీ మార్కెట్ ద్వారా రూ.1.67 కోట్ల ఆదాయం యార్డుకు వచ్చింది. గతేడాది జనవరి నుంచి ఈ ఏడాది గత నెల వరకు మార్కెట్‌కు చీనీ కాయలు వచ్చాయి. ఏడాదంతా 99,357 టన్నులు వచ్చాయి. దీంతో మార్కెట్ యార్డుకు యూజర్ చార్జెస్ రూపంలో రూ.1.67 కోట్లు వచ్చింది. ఏప్రిల్‌లో రూ.35.88 లక్షలు, మే నెలలో రూ.35.94 లక్షలు, జూన్‌లో రూ.31.99 లక్షలు, జూలైలో రూ.24.97 లక్షలు ఎక్కువగా ఆదాయం వచ్చింది. అన్ సీజన్ నెలలైన నవంబరులో రూ.3.56 లక్షలు, డిసెంబరులో రూ.1.67 లక్షల ఆదాయం సమకూరడం యార్డు ఆదాయానికి కొంత ఊరటనిచ్చింది.



మార్కెట్‌కు వచ్చిన చీనీకాయలు సమకూరిన ఆదాయం వివరాలివీ..

నెల	వచ్చిన టన్నులు	యూజర్ చార్జెస్ రూపంలో వచ్చిన సొమ్ము (రూపాయల్లో..)
జనవరి-2024	20	9,700
ఫిబ్రవరి-2024	934	1,08,000
మార్చి-2024	10,644	15,44,564
ఏప్రిల్-2024	17,909	35,88,100
మే-2024	18,116	35,94,500
జూన్-2024	16,591	31,99,700
జూలై-2024	21,482	24,97,250
ఆగస్టు-2024	10,189	14,26,460
సెప్టెంబరు-2024	753	1,36,300
అక్టోబరు-2024	86	31,460
నవంబరు-2024	1,475	3,56,430
డిసెంబరు-2024	734	1,67,870
జనవరి-2025	424	76,750
మొత్తం	99,357	1,67,37,084

సీజన్‌లో ఆశించిన స్థాయిలో కాయలు రాలేదు



ఏడాదంగా మార్కెట్‌కు చీనీకాయలు వచ్చాయి. ఇది మార్కెట్‌కు ఆదాయం పరంగా మేలు చేసింది. సీజన్‌లో అనుకున్న మేర చీనీ ఉత్పత్తులు మార్కెట్‌కు రాలేదు. అంతకు మునుపు ఏడాది కంటే తక్కువగానే వచ్చాయి. ఈ క్రమంలో యార్డుకు కొంత ఆదాయం తగ్గింది. అన్ సీజన్‌లో కాయలు వచ్చాయి. ఈక్రమంలో సీజన్‌లో తగ్గిన ఆదాయాన్ని కొంత వరకు పూడ్చుకోగలిగాం.

- గోవిందు, ఎంపికశ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ యార్డు, అనంతపురం

థ్యాంక్యూ సీఎం సర్..!

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రామగిరి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నసనకోట గురుకుల పాఠశాలను జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేసినందుకు కృతజ్ఞతగా సీఎం చంద్రబాబు చిత్రపటానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, విద్యార్థినులు క్షీరాభిషేకం చేశారు. గురుకుల సందర్శనకు బుధవారం వెళ్లిన ఎమ్మెల్యేకు విద్యార్థినులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అప్‌గ్రెడేషన్ వెనుక ఎమ్మెల్యే కృషి ఎంతగానో ఉందని ధన్యవాదాలు తెలిపారు. రామగిరి ప్రాంతంలో ఇంటర్ చదివే అవకాశం లేక చాలామంది బాలికలు చదువు మానేస్తున్నారని, ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లి జూనియర్ కాలేజీగా అప్‌గ్రెడేషన్ తెచ్చామని పరిటాల సునీత అన్నారు. డీఎస్పీ హేమంత్‌కుమార్ విద్యార్థిను పెన్నులను బహూకరించారు. టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, మండ ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, నసనకోట ఉప సర్పంచ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

జేఎన్‌టీయూ వీసీ బాధ్యతల స్వీకరణ


వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ నూతన వీసీగా ప్రొఫెసర్ సుదర్శనరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయంలో పూజలు నిర్వహించి కుటుంబ సభ్యులు, అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆయనకు అభినందనలు వెల్లువెత్తాయి. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, ఓస్‌డీటూ వీసీ ప్రొఫెసర్ దేవన్న, డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు బోధన, బోధనేతర సిబ్బంది సుదర్శనరావుకు పుష్పగుచ్ఛాలందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ప్రముఖులు, సంఘాల నాయకులు వీసీని కలిసి అభినందనలు తెలియజేశారు.

విద్యార్థి నుంచి గురువుగా..

1983లో జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన సుదర్శనరావు అదే కళాశాలలో ఆ సంవత్సరం ఆగస్టున అడహక్ ప్రాతిపదికన టీచింగ్ అసిస్టెంట్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, అసిసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌గా అంచెలంచెలుగా ఎదిగారు. 42ఏళ్ల వృత్తి జీవితంలో ఎన్నో పదవులు నిర్వహించి వాటికి వన్నె తెచ్చారు. దేశంలోని పదిమంది సీనియర్ ప్రొఫెసర్లలో ఒకరిగా గుర్తింపు పొందారు. 32ఏళ్ల పరిపాలనా అనుభవంలో 271 పరిశోధనా పత్రాలు ప్రచురించి రూ.469కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తిచేశారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రస్తుత హెచ్‌ఓడీ అజిత, డైరెక్టర్ ప్రొఫెసర్ వైశాలి గోర్పాడే, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్, మాజీ వీసీ రంగజనార్దన, ప్రొఫెసర్ అరుణ కాంతి లాంటి వారంతా సుదర్శనరావు శిష్యులు కావడం గమనార్హం.

ఆస్పత్రిలో తిట్ల దండకం

రాయదుర్గం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్ ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది మధ్య జరుగుతున్న అంతర్గతపోరు తారస్థాయికి చేరింది. ఎవరైనా వింటే అసహ్యించుకుంటారనే ధ్యాస కూడా లేకుండా బుధవారం బాహాటంగా దూషణలకు దిగారు. 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన 'జీతం చాలదని సైడ్ బిజినెస్' అనే కథనంపై వైద్య శాఖలో తీవ్ర చర్చ సాగింది. ఈక్రమంలోనే విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ప్రభుత్వ వైద్యులు ఒకరిపై ఒకరు నెపాన్ని వేసుకునే ప్రయత్నం చేశారు. ఆ ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులు తెలిపిన మేరకు ...డ్రాయింట్ అధికారిగా ఉన్న శ్రీలక్ష్మీ మరో వైద్యాధికారిణి మల్లేశ్వరికి మెమో జారీ చేశారు. మెమో కాపీని అక్కడున్న సీనియర్ అసిస్టెంట్ సోమశేఖర్‌కు ఇచ్చి, ఓపీకి హాజరు కాకుండానే వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత ఓపీ సేవలకు వచ్చిన డాక్టర్ మల్లేశ్వరి మెమో కాపీని తీసుకుని చించేసి చెత్తబుట్టలో పారేశారు. నాకు మెమో ఇచ్చేంత స్థాయి శ్రీలక్ష్మికి ఎక్కడుందని ఆగ్రహంతో తిట్ల దండకాన్ని అందుకున్నారు. దీంతో అక్కడే ఉన్న వైద్య సిబ్బంది, రోగులు నివ్వెరపోయారు.పేదల వైద్యం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలతో ఆస్పత్రులు కట్టించి, వైద్యసేవలందించడానికి సిబ్బందిని నియమిస్తే వీరు చేసే పని ఇదా అంటూ పలువురు రోగులు పెదవి విరిచారు.

శిక్షణను ఉపయోగించుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సీడాప్ ద్వారా స్వయం ఉపాధికి అందించే ఉచి త శిక్షణను ఉమ్మడి జిల్లాలోని మైనార్టీ నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని మైనార్టీ కార్పొరేషన్ ఈడీ సు బ్రహ్మణ్యం బుధవారం కోరారు. ఆసక్తి గల యువత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో మైనార్టీ కార్పొరేషన్ కార్యాలయం లో దరఖాస్తులను అందజేయాలన్నారు. వివరాలకు 9849901138కు సంప్రదించాలన్నారు.

23న సాయిప్రుడెంట్ స్కాలర్‌షిప్ పరీక్ష

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎంబీఏ కోర్సును ఉచితంగా అందించడమే లక్ష్యంగా ఈనెల 23న సాయిప్రుడెంట్ స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బాలకోటేశ్వరి తెలిపారు. ఈమేరకు అడ్మిషన్స్ డెరెక్టర్ ప్రశాంతితో కలిసి బీడుపల్లి సంస్కృతి స్కూల్ ఆఫ్ఇంజనీరింగ్‌లో పరీక్ష పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. జర్మనీలోని అనాహిత స్టిఫ్టంగ్‌ఫౌండేషన్ వారు ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రెండేళ్ల ఎంబీఏ కోర్సుతో పాటు హాస్టల్ సదుపాయం పూర్తి ఉచితంగా అందిస్తామన్నారు. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. వివరాల కోసం అభ్యర్థులు సెల్ నంబర్లు 9100064545/9100974544/9100974537 ను సంప్రదించాలని సూచించారు.


పరీక్ష పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రొఫెసర్ ప్రశాంతి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

విజయ నిర్మల (జయంతి)



ప్రముఖ తెలుగు సినీ నటి, దర్శకురాలు విజయనిర్మల 1946 ఫిబ్రవరి 20న నరసారావుపేటలో జన్మించారు. సూపర్‌స్టార్ కృష్ణ భార్య. అసలు పేరు నిర్మల అయితే తనకు సినీ రంగంలో తొలి అవకాశం కల్పించిన విజయ స్టూడియోస్‌కు కృతజ్ఞతగా 'విజయ నిర్మల'గా పేరు మార్చుకున్నారు. పాండురంగ మహత్మ్యంలో బాలనటిగా సినీరంగంలో ప్రవేశించారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి కథానాయికగా ఉన్నత స్థానానికి చేరారు. ప్రపంచంలోనే అత్యధికంగా 44 సినిమాలకు దర్శకత్వం వహించిన మహిళగా 2002లో గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించారు. ఆమె నటించిన అత్యధిక చిత్రాలలో కథానాయకుడు కృష్ణ కావడం ప్రత్యేకత. వీరిద్దరు జంటగా సుమారు 50 సినిమాలలో నటించారు. అక్కా చెల్లెలు, అగ్ని పరీక్ష, పండంటి కాపురం, దేవుడు చేసిన మనుషులు, అల్లూరి సీతారామరాజు, శ్రావణమాసం తదితర సినిమాలు ఉన్నాయి. రఘుపతి వెంకయ్య అవార్డు పొందారు. 2019 జూన్ 27న కన్నుమూశారు.

శ్రీకంఠదత్త నరసింహరాజ ఒడయార్ (జయంతి)



మైసూరు రాజవంశీయులైన శ్రీకంఠదత్త నరసింహరాజ ఒడయార్ 1953 ఫిబ్రవరి 20న జన్మించారు. మైసూరు సంస్థానానికి చివరి రాజు ఆయనే కావడం విశేషం. మైసూరు పార్లమెంటు నియోజకవర్గం నుంచి సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఫ్యాషన్ రంగంపై ఉన్న ఆసక్తితో మైసూరు పట్టు చీరలను ఇతోధికంగా ప్రోత్సహించారు. కాంగ్రెస్ పార్టీలో కొన సాగారు. కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్‌గా అధ్యక్షుడిగా వ్యవహరించారు. మైసూరు దసరా ఉత్సవాలలో నేటికీ సంప్రదాయ ప్రైవేట్ రాజదర్బార్ కొనసాగుతుంది. అనంతరం రాజసింహాసనాన్ని మైసూరు అంబా విలాస్ ప్యాలెస్‌లో భద్రపరుస్తారు. 60వ యేట గుండెపోటుతో ఆయన 2013 డిసెంబరు 10న కన్నుమూశారు.

ఏప్రిల్ 27న టీసీఎస్ వరల్డ్ 10కే మారథన్

బెంగళూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో నిర్వహించే ప్రముఖమైన మారథాన్‌లలో టీసీఎస్ వరల్డ్ 10కే ఒకటి. ఏప్రిల్ 27న మారథాన్ ఉంటుందని నిర్వాహకులు బుధవారం ప్రకటించారు. ప్రొక్యామ్ ఇంటర్నేషనల్ ముఖ్యులు వివేక్‌సింగ్, టీసీఎస్ బెంగళూరు రీజనల్ హెడ్ సునిల్ దేశ్‌పాండేలు మారథాన్‌కు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. మంత్రి దినేశ్ గుండూరావు, మేజర్ జనరల్ వీటీ మాథ్యూ, సతీశ్‌ఖన్నా, తదితరులు ప్రసంగించారు. మన జీవనంలో పరుగు ఒక భాగం కావాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. రోజులో కొంత సమయం వ్యాయామం, క్రీడలకు కేటాయించడం ద్వారా చక్కటి ఆరోగ్యం సాధ్యం చేసుకోవాలన్నారు. జాతీయస్థాయిలో జరిగే 10కే పోటీల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



మారథాన్ లోగో ఆవిష్కరణలో నిర్వాహకులు, ప్రముఖులు

మంత్రులతో కాంగ్రెస్ నాయకుల భేటీ



మంత్రి సుధాకర్‌తో పుట్టు ఆంజినప్ప తదితరులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో వారితో కలసి ప్రముఖ నాయకుడు, సమాజసేవకుడు పుట్టు ఆంజినప్ప మంత్రులతో భేటీ అయ్యారు. శిడ్లఘట్ట నియోజకవర్గం యువ కాంగ్రెస్ అధ్యక్షుడు దర్శన్‌రాజ్, చిలకలనేర్పు బ్లాక్ యువ కాంగ్రెస్ అధ్యక్షుడు రవిచంద్ర, శిడ్లఘట్ట బ్లాక్ యువకాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాకేశ్‌లతో కలసి మంత్రులు డాక్టర్ ఎంసీ సుధాకర్, కృష్ణబైరేగౌడ, దినేశ్‌గుండూరావ్, నియోజకవర్గ ముఖ్యులు శశిధర్ మునియప్పలను మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. ఇదే సందర్భంగా నియోజకవర్గ అంశాలపై మంత్రులతో ఆంజినప్ప చర్చించారు. పార్టీ బలోపేతానికి పాటుపడిన యువతను మంత్రులు అభినందించారు. ఈ సందర్భంగా రాజకుమార్, సాదిక్, వైహుణసేనహళ్ళి గ్రామపంచాయతీ అధ్యక్షుడు మురళి, గుడిహళ్ళి చంద్రు, వారహుణసేనహళ్ళి మంజునాథ్, దామోదర్, దేవరాజ్, సుగటూరు నాగేశ్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో రెగ్యులర్ డాక్టర్

చేళూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన చేళూరులోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇటీవల రెగ్యులర్ డాక్టర్ భాస్కర్ నియమితులయ్యారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను ఇదివరకు శిడ్లఘట్టలో విధులు నిర్వహించానన్నారు. ప్రతిరోజూ పీహెచ్‌సీకి చుట్టుపక్కల ప్రాంతాలనుంచి 50మంది వరకు ఓపీడీ ద్వారా చికిత్సలు పొందుతుంటారన్నారు. నర్సు, ఇతర సిబ్బంది ఇక్కడ ఆరుమంది దాకా ఉన్నారు. చాలాకాలం తర్వాత తాలూకా కేంద్రానికి రెగ్యులర్ డాక్టర్ నియమితులు కావడంతో వైద్యసిబ్బంది కొరత తీరినట్టయ్యిందని పలువురు అభిప్రాయపడ్డారు.



చేళూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

పీఏసీఎస్ అధ్యక్షురాలిగా సుశీలమ్మ



నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

దొమ్మసంద్ర, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బన్నేరుఘట్ట ప్రాథమిక వ్యవసాయ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ (పీఏసీఎస్) నూతన అధ్యక్షులుగా సుశీలమ్మ, ఉపాధ్యక్షులుగా డి.ఎంరఘు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆనేకల్ తాలూకాలోని బన్నేరుఘట్ట వ్యవసాయ సేవా సహకారసంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షస్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారురాలు సుశీలమ్మ, ఉపాధ్యక్షులుగా బీజేపీ మద్దతుదారుడు బిఎం రఘు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను అన్నిసంఘాల డైరెక్టర్‌లు, బీజేపీ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విజయోత్సవం నిర్వహించి మిఠాలు పంచిపెట్టారు. జడ్పీ మాజీ సభ్యుడు జయరాం, ప్రముఖులు బాబుసింగ్, నరేంద్ర బాబు, మహేశ్‌గౌడ తదితరులు బుధవారం అభినందించారు.

ఘనంగా ఆలయ మహాకుంభాభిషేకం



విశేషపూజల్లో మాజీ మంత్రి అరవింద లింబావళి

మహదేవపుర, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బిదరహళ్ళి హోబళి ఆదూరులోని రేణుకా యల్లమ్మ, సవారమ్మ, దొడ్డమ్మ, పకేళమ్మ దేవి ఆలయ మహాకుంభాభిషేకం మహోత్సవం ఘనంగా జరిగింది. బుధవారం జరిగిన విశేషపూజల్లో మాజీ మంత్రి అరవింద లింబావళి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్తులందరి సహకారంతో కలసికట్టుగా ఉత్సవం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. యల్లమ్మను ప్రతిష్ఠించిన స్థానంలో పరశురాముడిని కూడా ప్రతిష్ఠించాలని సాధ్యమైనంత త్వరగా పరశురాముడి ప్రతిష్ఠ చేయాలన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు కాగా ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు ఇప్పటివరకు 54కోట్లమంది పుణ్యస్నానాలు చేశారన్నారు. వచ్చే మహాశివరాత్రికి మరింతమంది స్నానం చేస్తారన్నారు. కాగా అమెరికా నుంచి కూడా మన సంస్కృతి పాటిస్తూ మహాకుంభమేళాకు వచ్చారన్నారు. కార్యక్రమంలో విభూతిపుర వీరసింహాసన మఠం డాక్టర్ మహంతలింగ శివాచార్య స్వామిజీ, బీజేపీ రాష్ట్ర పరిషత్ సభ్యుడు బిఎన్ నటరాజ్, జడ్పీ మాజీ సభ్యుడు గణేశ్, దొడ్డగుబ్బి, గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు మాలా మారుతి కుమార్, ఆలయ ట్రస్టు అధ్యక్షుడు నాగరాజ్, ఆదూరు మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహకార సంఘం ప్రథమ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న అధ్యక్షుడు సీతారామస్వామి, సహకార సంఘం సభ్యులు, అధికారులు

సిరుగుప్ప, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి వాసుదేవ సహకార సంఘం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం సిరుగుప్ప పట్టణం 9వ వార్డులో సంఘం అధ్యక్షుడు డీఎంవీ సీతారామస్వామి (వాసునాయుడు) ఆధ్వర్యంలో కేకు కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలు అభివృద్ధి బాటలో నడవాలంటే రుణాలు తీసుకున్న ఖాతాదారులు సకాలంలో చెల్లించాలన్నారు. అనంతరం డైరెక్టర్లు, సర్వసభ్యులు, అధ్యక్షులు వాసునాయుడును ఘనంగా సన్మానించారు. ఉపాధ్యక్షులు దశరథరెడ్డి, మేనేజర్ హరిత, డైరెక్టర్లు డీఎల్ఆర్‌సీ వీరేష, శివబసవన గౌడ, రంగనాథరెడ్డి, చెన్న వీరన్న గౌడ, పంపన్నగౌడ, శాలిని, హిమబిందు, సిబ్బంది పాల్గొన్నారు.

కూలీ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

కంప్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వున్న కట్టడ కూలీ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పురసభ అధ్యక్షుడు బట్టప్రసాద్‌కు మనవిపత్రం అందించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్భవ గణపతి ఆలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు కూలీలు ర్యాలీ చేపట్టారు. సత్తిబాబు మాట్లాడుతూ ఎన్నోయేళ్లుగా కట్టడ కూలీ కార్మికులకు ఇళ్లు లేక ఆరుబయటే జీవనం సాగిస్తున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి ఇంటి పట్టాలతోపాటు ఇళ్లు నిర్మించి ఆదుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పనులకు తగ్గట్టు కూలి అందించడంలో విఫలమయ్యారన్నారు. వారికి బీమాతో పాటు ఆరోగ్య పథకం కల్పించి ఆదుకోవాలన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యేతో చర్చలు జరిపి న్యాయం చేకూరుస్తామని అధ్యక్షుడు తెలిపారు. బండి బసవరాజు, వన్నూరుసాబ్, నాగరాజు, ఎల్లలింగ, మంజు, నూర్, వన్నూరమ్మ, నరసింహ, దేవేంద్ర, రంగయ్య, జాఫర్, రాజశేఖర్, చంద్రశేఖర్, దస్తగిరి, పాల్గొన్నారు.

2.58 లక్షల మందికి పీఎం కిసాన్ సొమ్ము విడుదల

కొత్తచెరువు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాలో 2.58 లక్షల మంది రైతులకు 19వ విడత పీఎం కిసాన్ సొమ్ము రూ.51.51 కోట్లు కేంద్రప్రభుత్వం విడుదల చేసింది. ఆ సొమ్మును ఈనెల 24న ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా జమ చేస్తారని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు బుధవారం ప్రకటనలో తెలిపారు.

2.85 లక్షల మందికి..

అనంతపురం అర్బన్: అనంత జిల్లాలోని 2.85 లక్షల మంది రైతులకు రూ.57.02 కోట్లు పీఎం కిసాన్ సొమ్మును ఈనెల 24 ప్రధాని జమ చేస్తారని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ప్రకటనలో తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ఉరవకొండ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని లత్తవరం తండాలో ఇంటర్ విద్యార్థిని కావ్య(16) ఆత్మహత్యకు పాల్పడింది. ఈశ్వర్‌నాయక్, జానకీబాయి దంపతుల కుమార్తె అయిన కావ్య ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. కాగా బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటికి కుటుంబసభ్యులు వచ్చి చూసి కిందకు దించి పరిశీలించగా.. అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న సీఐ మహానంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

గంజాయి స్వాధీనం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలూరు రోడ్డులో గల గులాంషా ఖాద్రీ దర్గా ఆర్చి వద్ద బుధవారం ముగ్గురు గంజాయి విక్రేతలను అరెస్టు చేసి వారి నుంచి 11వందల గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. తర్వాత వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. పట్టణానికి చెందిన షికారి నాగ అలియాస్ నాగులు, అశోక్‌కుమార్, తాడిపత్రికి చెందిన అల్తాఫ్ ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్ రైల్వే స్టేషన్‌లో గంజాయిని కొనుగోలు చేసి గుంతకల్లుకు తీసుకొచ్చి.. ఇక్కడ చిన్న ప్యాకెట్‌లలో వేసి విక్రయాలు జరుపుతూ పట్టుబడ్డారని సీఐ వివరించారు.

అహుడా వార్డు ప్లానింగ్ సెక్రటరీ ఆత్మహత్య

● అనుమానం ఉందంటూ తల్లి ఫిర్యాదు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): అహుడా వార్డు ప్లానింగ్ సెక్రటరీ నాగశ్రీ(32) ఈనెల 18న ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతిపై అనుమానం ఉందంటూ నాగశ్రీ తల్లి.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... స్థానిక మారుతీనగర్ మొదటి క్రాస్‌కు చెందిన నాగశ్రీ, మూడో క్రాస్‌కు చెందిన ద్వారకేశ్ ఐదేళ్ల క్రితం ప్రేమించి, పెళ్లి చేసుకున్నారు. నాగశ్రీ నగరపాలక సంస్థలో ఉద్యోగం సంపాదించింది. కార్పొరేషన్ నుంచి అహుడా వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ సెక్రటరీగా రెండేళ్ల క్రితం డిప్యుటేషన్‌పై వచ్చి పనిచేస్తుండేది. భర్త సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. వారికి మూడున్నరేళ్ల పాప సంతానం. మూడు రోజులుగా భర్తకు అనారోగ్యం అంటూ నాగశ్రీ సెలవు పెట్టింది. మంగళవారం విధలకు హాజరుకాలేదు. మధ్యాహ్నం సమయంలో బ్యాంకుకు వెళ్లామనీ, రెడీ కావాలని బయట పనిచూసుకుని వస్తానని నాగశ్రీకి భర్త చెప్పి వెళ్లాడు. తర్వాత కాసేపటికే తల్లి పద్మావతి.. ద్వారకేశ్‌కు ఫోన్‌చేసి నాగశ్రీ ఉరి వేసుకుందని తెలిపింది. వెంటనే ఇంటికి చేరుకున్న అతడు.. తన తల్లిదండ్రులతో కలిసి తలుపులు బద్దలుకొట్టి గదిలోకి ప్రవేశించి, నాగశ్రీనికి కిందికి దించారు. ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆమె రాత్రి 10 గంటల సమయంలో మృతిచెందింది. దీనిపై అనుమానం ఉందంటూ నాగశ్రీ తల్లి శైలామణి ఫిర్యాదు చేసింది. కొన్ని రోజుల క్రితం వడిబియ్యం కార్యక్రమానికి తమ ఇంటికి కూతురిని పంపాలని కోరితే నిరాకరించారని ఫిర్యాదులో పేర్కొంది. ఆత్మహత్యపై నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్పెంటర్ ఆత్మహత్యాయత్నం

● విద్యుత్ శాఖ అధికారుల తీరుతో మనస్తాపం

కణేకల్లు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల తీరుతో మనస్థాపం చెందిన ఓ కార్పెంటర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలకేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుడైన ఇషాక్‌వలి కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కాగా అతడు నిర్వహిస్తున్న సామిల్లుకు గతేడాది ఏప్రిల్ 1వతేదీన విద్యుత్ అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి మీటర్ బిగించారు. సిబ్బంది ప్రతినెలా రీడింగ్ చేయకుండా మూడునెలల బిల్లు రూ. 79,148ను ఒకేసారి చెల్లించాలని జూలై 5వ తేదీన ఇషాక్‌వలికి అందజేశారు. ఇందుకు ఆందోళన చెందిన అతను అంతబిల్లు తాను చెల్లించలేనని, కాస్త తగ్గించాలని అప్పటినుంచి విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. వారు ఒప్పుకోలేదు. నేరుగా ఎస్ఈని కూడా కలిసి విన్నవించాడు. పలుసార్లు గ్రీవెన్స్‌లో అర్జీలను అందించాడు. ఎవరూ అంగీకరించలేదు. కాగా బుధవారం ఉరవకొండ ఏడీఏ భాస్కర్, ఏఈ శంకర్‌నాయక్ అతడి సామిల్లుకు వెళ్లి బిల్లు ఎలాగైనా కట్టాలని సూచించారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన ఇషాక్‌వలి కొద్దిసేపటి అనంతరం విద్యుత్ కార్యాలయానికి వెళ్లి మూడునెలలకే ఇంత బిల్లు వస్తుందా అని ఆ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. తన దుకాణంలో అంత విద్యుత్ వాడకం లేదని తెలిపాడు. అయినా అధికారులు వినకపోవడంతో మనస్థాపం చెందిన అతను వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగేందుకు ప్రయత్నించాడు. వెంటనే అధికారులు అడ్డుకుని మరో రెండురోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని, ఆందోళన చెందవద్దని చెప్పారు. దీంతో ఇషాక్‌వలి వెనుదిరిగాడు.



విద్యుత్ అధికారుల ఎదుట పురుగుల మందు డబ్బాతో కార్పెంటర్ ఇషాక్‌వలి

డిమాండ్ల సాధనకు టీచర్ల నిరసన



నిరాహార దీక్ష చేస్తున్న టీచర్లు

బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): 'మన కన్నడ పాఠశాలలను కాపాడండి' అనే నినాదంతో ఉపాధ్యాయులు నిరాహారదీక్ష చేపట్టారు. నగరంలోని ఫ్రీడంపార్కులో బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 1995 అనంతరం ప్రారంభమైన కన్నడ మీడియం పాఠశాల, కళాశాలను ఎయిడెడ్ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

అలరించిన పాఠశాల వార్షికోత్సవం



ముఖ్యులకు ఆత్మీయ సన్మానం

విజయనగర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జగ్జీవన్‌రామ్‌నగర్ పరిధిలోనిపాదరాయనపురలోగల కిన్‌కిడ్స్ కాన్వెంట్ 37వ వార్షికోత్సవం టౌన్‌హాల్‌లో బుధవారం ఘనంగా జరిగింది. రాష్ట్ర అల్పసంఖ్యాక అభివృద్ధి మండలి అధ్యక్షుడు బీకే అల్తాఫ్‌ఖాన్ ముఖ్యులుగా విచ్చేశారు. బీజేపీ నాయకుడు జీవీ కేశవన్ మాట్లాడుతూ కాన్వెంట్‌లో చదివిన ఎంతోమంది ఉన్నతహోదాలలో ఉన్నారన్నారు. కాన్వెంట్ వ్యవస్థాపకుడు రఫీక్ అహ్మద్ దంపతులను ఆత్మీయంగా సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. వ్యాఖ్యాతగా పద్మావతి వ్యవహరించారు.

అంబేడ్కర్ ఆశయాలు నేటికీ అనుసరణీయం



వేదికపై ప్రముఖులు

ముళబాగిలు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు నేటికీ అనుసరణీయమని దళితనేత బీ గోపాల్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని నేతాజి క్రీడామైదానంలో బహుజనసంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో భీమ్‌కోరెగావ్ విజయోత్సవం, దళిత పోరాటం 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అస్పృశ్యత నిర్మూలన, శోషిత వర్గాలకు సామాజిక న్యాయం అందడంకోసం అంబేడ్కర్ తన జీవితాన్ని పూర్తిగా పోరాటస్ఫూర్తితో సాగించారన్నారు. స్వాతంత్ర్యం లభించి ఏడు దశాబ్దాలు గడిచినా ఇంకా అస్పృశ్యత కొనసాగడం విచారకరమన్నారు. ప్రజలలో చైతన్యంతోనే సమాజంలో మార్పు సాధ్యమని అభిప్రాయపడ్డారు. చామరాజనగర్ మధు హొలెయార్, బెంగళూరు దళితనేత వెంకటేశ్, జిల్లా నాయకుడు విజయ్ కుమార్, ముని వెంకటప్ప తదితరులు ప్రసంగించారు. డీఎస్ఎస్ జిల్లా సంచాలకులు మెకానిక్ శ్రీనివాస్, గొల్లహళ్ళి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతికి అదనపు సర్వీసులు నడపండి

చేళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించునేందుకు నిత్యం భక్తులు వెళ్తుంటారు. బాగేపలి నియోజకవర్గ పరిధిలోని చేళూరు తాలూకా నుంచి తిరుపతికి ప్రతిరోజు ఒక కేఎస్ఆర్‌టీసీ బస్సు సర్వీసు ఉంది. ఉదయం 7.30 గంటలకు చేళూరులో బయల్దేరుతుంది. బి కొత్తకోట, మదనపల్లి, వాయల్పాడు, కలికిరి, పీలేరు మీదుగా ఈ బస్సు ఉంది. ప్రస్తుత తరుణంలో మరొక సర్వీసు నడపాలని ప్రయాణీకులు, భక్తులు కోరుతున్నారు.


ప్రాణం తీసిన ఆన్‌లైన్ జూదం

ధర్మవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ జూదం ఓ యువకుడి ప్రాణం తీసింది. హిందూపురం రైల్వే పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు పట్టణంలోని సత్యసాయినగర్‌కు చెందిన యనమల అశోక్(32) రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. రెండు రోజుల కిందట ఇంటిని తనఖా పెట్టి బ్యాంక్‌లో రూ.8లక్షలు రుణం తీసుకున్నాడు. ఇందులో రూ.2లక్షలు అప్పు చెల్లించాడు. రూ.లక్ష భార్య ధరణి ఖాతాలో జమచేశాడు. మిగిలిన రూ.5లక్షలతో ఇటుకల బట్టీని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. అయితే ఆన్‌లైన్ జూదం అలవాటు ఉన్న అశోక్ రెండు రోజుల్లో మొత్తం సొమ్ము పోగొట్టుకున్నాడు. ఈ విషయం కుటుంబసభ్యులకు చెప్పుకోలేక తీవ్రంగా మథపడ్డాడు. ఈక్రమంలోనే మంగళవారం బ్యాంకులో బంగారు తాకట్టు పెట్టి డబ్బులు తెస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భార్యకు ఫోన్‌చేసి రావడానికి లేటు అవుతుందని చెప్పాడు. సాయంత్రమైనా రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేస్తే నాట్ రీచ్‌బుల్ అని వచ్చింది. దీంతో వారు ఆందోళనతో అతడిని వెతకడం ప్రారంభించారు. అయితే మంగళవారం రాత్రి అశోక్ తన ద్విచక్ర వాహనాన్ని కేతిరెడ్డికాలనీ సమీపంలోని ట్రాక్ వద్ద ఉంచి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీన్ని బుధవారం తెల్లవారు జామున గమనించిన రైల్వేకీమన్ హిందూపురం రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని, పట్టాల సమీపంలో ఉన్న ద్విచక్రవాహనంలో ఉన్న ఆధారాలను బట్టి మృతుడు అశోక్ కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. దీంతో కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని గుర్తించి బోరున విలపించారు. అనంతరం అశోక్ భార్య ధరణి ఫిర్యాదు మేరకు హిందూపురం రైల్వే జమేదార్ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వృద్ధురాలిపై దాడి

● 12 తులాల బంగారం చోరీ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై దాడిచేసి 12 తులాల బంగారం చోరీ చేసిన సంఘటన మండలకేంద్రంలో మంగళవారం రాత్రి జరిగింది. బాధితురాలి బంధువులు తెలిపిన మేరకు.. పోలీస్ స్టేషన్ సమీపంలోని పాత పెట్రోల్ బంక్ వద్ద రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి లక్ష్మమ్మ ఒంటరిగా నివాసం ఉంటోంది. ఈ విషయం గుర్తించిన దుండగులు మంగళవారం రాత్రి ఇంటి తలుపు తట్టారు. ఆమె తలుపులు తీసిన వెంటనే దుండగుడు చేతిలో ఉన్న సుత్తితో తలపై కొట్టి, గుంతు నులిమాడు. దీంతో ఆమె స్పృహ కోల్పోయింది. ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారం చైన్ చేతులకు ఉన్న నాలుగు గాజులు(8 తులాలు) తీసుకుని ఉడాయించారు. కొద్దిసేపటి తరువాత స్పృహలోకి వచ్చిన ఆమె తన కుమార్తెకు ఫోన్ చేసి, విషయం చెప్పింది. కుమార్తె బంధువులతో అక్కడికి చేరుకుని గాయపడిన లక్ష్మమ్మను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. బాధితురాలు లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1611.06	1,587.77
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,115	165
నీటి నిల్వ (టీఎంసీలు)	39.70	9.27

ఈరన్నస్వామికి పూజలు



బళ్లారి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బళ్లారి గ్రామీణ నియోజకవర్గంలోని మోకాలో వెలసిన ఈరన్నస్వామి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా ఈరన్న సామి ఉత్సవాలు జరపడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం ఉదయం గంగపూజ చేసి అక్కడి నుంచి గంగను ఈరన్నస్వామి ఆలయం వద్దకు ఊరేగింపుగా తెచ్చారు. ఆలయం ఎదుట గంగను ఉంచి పూజలు చేశారు. ఉదయం స్వామికి గంగాభిషేకం, తేనె, నెయ్యాభిషేకం చేసి పుష్పాలకంరణతో పూజలు చేశారు.

కొనసాగిన ఉడుసులాంబ జాతర



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

తోరణగల్లు, ఫిబ్రవరి 19(ఆంధ్ర జ్యోతి): సండూరు తాలుకా కురేకుప్ప పట్టణంలో గ్రామదేవత ఉడుసులాంబ జాతర కుంభ మహోత్సవాన్ని మంగళ, బుధ వారాలలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం కలశపూజ నిర్వహించారు. 19వ తేదీన కుంభ మహోత్సవాన్ని భక్తులు చేపట్టారు. కురేకుప్ప పట్టణ క్రాస్ నుంచి అమ్మవారి దేవస్థానం వరకు విద్యుత్ దీపాలతో అన్ని వీధులలో అలంకరించారు. 19వ తేదీ రాత్రి 1.15 నుంచి ఉదయం 4.30 గంటల వరకు పట్టణంలో కుంభ మహోత్సవాన్నినిర్వహించారు. డోలుడప్పులు కోలాటం, ఊరేగింపును ఎంతో ఉత్సాహంగా సాగాయి. పలు ప్రాంతాల నుంచి అధి సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కురేకుప్ప పురసభ అధికారులు సిబ్బంది గ్రామంలో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు



ఆరోగ్య కేంద్రం నిర్వహిస్తున్న డాక్టర్ భారతి, సిబ్బంది

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మోకా మల్లేశ్వరస్వామి జాతర సందర్భంగా గ్రామంలో సముదాయ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ భారతి, సీనియర్ హెల్త్ ఆఫీసర్ బసవరాజు ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జాతరలో పలు ప్రాంతాల్లో భోజన కేంద్రాల వద్ద ప్రజలకు స్వచ్ఛత గురించి అవగాహన కల్పించారు. ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహదాయిపై మాజీ ప్రధాని వ్యాఖ్యలు హాస్యాస్పదం

రాయచూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మహదాయి పథకం అమలు కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కలిసి పోరాడుదామని మాజీ ప్రధాని దేవేగౌడ కాంగ్రెస్ పార్టీని కోరడం హాస్యాస్పదమని మంత్రి ఎన్.ఎస్.భోసరాజు అన్నారు. ఈ విషయంలో ప్రధాన మంత్రిని నేరుగా కలిసి విజ్ఞప్తి చేసే ధైర్యం ఆయనకు లేదా అని ప్రశ్నించారు. బుధవారం నగరంలోని తన నివాసంలో విలేఖరులతో మంత్రి మాట్లాడారు. దేవెగౌడ తన పార్టీని ఎన్‌డీఏలో కలిపినా రాష్ట్రానికి వచ్చిన ప్రయోజనం ఏమిటో వివరించాలన్నారు.

పాఠ్యాంశాల్లో మార్పులు అవసరం

● కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి పాఠ్యాంశాల్లో మార్పులు అవసరమని కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ అకౌంటెంట్స్ బ్రాంచ్ నుంచి మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజస్(ఎంఎస్‌మీఈఎస్)కోసం ఐసీఐ సహాయ్ వాణిని కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యాపారాలను స్థాపించి ఉద్యోగాలు సృష్టించాలన్నారు. దీని కోసం ప్రభుత్వ ప్రతినిధిగా నేను చార్టర్డ్ అకౌంట్స్ , ఇతర సంస్థలతో కలిసి అవసరమైన నైపుణ్యాలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తానన్నారు. మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ కమిటీ, ఐసీఏఐ సౌత్ ఇండియా డివిజన్ మాజీ అధ్యక్షుడు సిరిగేరి పన్నరాజ్ మాట్లాడుతూ ఐసీఏఐ బళ్లారి బ్రాంచ్ స్థాపన,సాధించిన విజయాలను వివరించారు. బళ్లారి బ్రాంచ్‌లోని ఐసీఏఐ హెల్ప్ డెస్క్ నెలకు రెండు రోజులు వ్యవస్థాపకులుగా మారాలనుకునే యువతకు మార్గనిర్దేశం చేయడం ప్రారంభిస్తున్నామన్నారు. సంస్థ అధ్యక్షుడు వెంకటనారాయణ,



ఐసీఐ సహాయ వాణిని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

ఉపాధ్యక్షుడు గజరాజ్, కార్యదర్శి స్వప్నప్రియ, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. అల్లం కరిబసప్ప, రావు బహదూర్ వైమహాబలేశ్వరప్ప ఎంబీఏ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించకపోతే చర్యలు



పెట్రోల్ నాణ్యతను పరిశీలిస్తున్న చైర్మన్ కృష్ణప్ప

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో సౌకర్యలు కల్పించకపోతే చర్యలు చేపడతామని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ కృష్ణప్ప హెచ్చరించారు. బుధవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆయన తనిఖీ చేపట్టింది. ఆహార శాఖ అధికారులతో కలిసి పౌర సరఫరాల సంస్థ గిడ్డంగులను పరిశీలించారు. బళ్లారి నగరం, గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాలను సందర్శించి రేషన్ పంపిణీని పరిశీలించారు. రేషన్ సరిగ్గా పంపిణీ అవుతోందాని నిర్ధారించేందుకు లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వివరాలు సేకరించారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, సాంఘిక సంక్షేమ శాఖ, వెనుకబడిన తరగతుల శాఖల హాస్టళ్లను ఆయన సందర్శించి ఆహార నాణ్యత, పరిశుభ్రత, విద్యార్థులకు అవసరమైన సామగ్రిని పరిశీలించారు. లా అండ్ మెట్రాలజీ శాఖ ఆధ్వర్యంలోని పెట్రోల్ పంపులను తనిఖీ చేశారు. బళ్లారి నగరంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. పిల్లలకు అందించే పోషకారంపై బీఐఎంఎస్ ఆసుపత్రి అధిపతి నుంచి సమాచారం సేకరించారు. అనంతరం కంప్లి, సండూర్, సిరుగుప్ప తాలూకాల్లోని గిడ్డంగులు, దుకాణాలను తనిఖీ చేశారు. బళ్లారి నగరంలోని వివిధ హోటళ్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించారు. కార్యక్రమంలో ఆహార పౌర సరఫరాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ సకీనా, మహిళా శిశు అభివృద్ధి శాఖ డీడీ విజయ్‌కుమార్, బాలల రక్షణ యూనిట్ అధికారి నాగప్ప, డాక్టర్ అబ్దుల్లా పాల్గొన్నారు.

హాస్టల్‌లో వసతులు కల్పించకపోతే చర్యలు

కంప్లి, : మోరార్జీ దేశాయ్ వసతి పాఠశాలలో విద్యార్థులకు సరియైన సదుపాయాలు కల్పించకపోతే చర్యలు తప్పవని పౌర ఆహార శాఖ కమిషనర్ లింగరాజు కోటె, మారుతి, దొడ్డలింగ హెచ్చరించారు. కంప్లి పట్టణంలో బుధవారం ఆకస్మికంగా పౌర ఆహార శాఖ కమిషనర్లు వసతి గృహాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే సదుపాయాలు అందించినప్పుడే అధికారులు గుర్తింపు పొందుతారని వార్డెన్ మల్లప్ప, ప్రిన్సిపాల్ బసవరాజుకు సూచించారు. ఆహారశాఖ అధికారి విరుపాక్షి గౌడ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న అధికారులు

రక్తదానం వ్యాపారం కాదు... సేవకు సంకేతం..

● డాక్టర్ మహిపాల్

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రక్తదానం సేవకు సంకేతమని భారతీయ రెడ్ క్రాస్ సంస్థ బళ్లారి ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.జె.వి. మహిపాల్ అన్నారు. బళ్ళారి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్(బీఐటీఎం) ఇంజనీరింగ్ కళాశాలలో దివంగతి బసవరాజేశ్వరి 17వ వర్ధంతి సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ 138 సార్లు రక్తదానం చేసిన డాక్టర్ నాగరాజు త్యాగ, సేవను నేటి తరం విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమాన్ని బెళగావికి చెందిన విశ్వేశ్వరయ్య సాంకేతిక విశ్వ విద్యాలయం, విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, బళ్ళారి కిష్కింద విశ్వ విద్యాలయం, బళ్ళారి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, బళ్లారి బిజినెస్ కళాశాల, బీఎంసీ, ఆర్‌సీ, రెడ్‌క్రాస్ సంస్థ, కర్ణాటక జాతీయ సేవా యోజన సంయుక్తంగా నిర్వహించారు. కిష్కింద విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ టి.ఎన్.నాగభూషణ మాట్లాడుతూ రక్తదానం చేసినవారు చావు బతుకుల మధ్య



రక్తదాన శిబిరంలో పాల్గొన్న రెడ్ క్రాస్ సంస్థ ఉపాధ్యక్షుడు మహిపాల్

కొట్టుమిట్టాడుతున్న వారికి ప్రాణదాతగా మిగిలి పోతారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ రేడియాలజిస్టు డాక్టర్ నాగరాజు తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. డాక్టర్ వి.జి.భరత్, ట్రస్టీ టీఏహెచ్‌ఆర్‌డీ ట్రస్ట్ డాక్టర్ ఈరణ్ణ, రిజిస్ట్రార్ డాక్టర్ వి.సి. పాటిల్, డీన్, పి.అమరేశ్వయ్య పాల్గొన్నారు. 210మందికి పైగా విద్యార్థులు, బోధక, బోధనేతర సిబ్బంది రక్తదానం చేశారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

● ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

బళ్లారిసిటీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లు వేసిన వారు ఆ భూమిని క్రమబద్ధీకరించి బీ-ఖాతా వ్యవస్థను అమలు చేశామని, బళ్లారి ప్రాంతంలోని ఆస్తి యజమానులు అవసరమైన పత్రాలను సమర్పించి బి-ఖాతా పొందాలని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి సూచించారు. బీ-ఖాతా గురించి ప్రజలకు వివరించేందుకు బుధవారం కార్పొరేషన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో బీ-ఖాతా జారీచేసే ప్రచారాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారం ప్రారంభించారన్నారు. రాబోయే మూడు నెలల్లో ఈప్రచారాన్ని పూర్తిచేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించి అవసరమైన పత్రాలను సమర్పించి 7 రోజుల్లోపు బి-ఖాతా పొందవచ్చన్నారు. ప్రజల సౌకర్యం కోసం కార్పొరేషన్‌లోని వార్డు వారీగా వలంటీర్లను నియమిస్తారన్నారు. వారు ప్రతి ఇంటిని సందర్శించి అదనపు పత్రాలను సేకరించి రిజిస్ట్రేషన్ కోసం చర్యలు తీసుకుంటారన్నారు. బళ్లారి నగర అభివృద్ధికి రోడ్డు పునరుద్ధరణ పనులు సహా అనేక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించామన్నారు. వేసవిలో తాగునీటిసరఫరాలో ఎటువంటి ఇబ్బంది లేకుండా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. నగరం నడిబొడ్డున ఉన్న క్లాక్ టవర్ ప్రారంభోత్సవం గురించి ఆయన స్పష్టం చేస్తూ క్లాక్ టవర్ పక్కన యాంఫిథియేటర్ నిర్మాణం జరుగుతోందనివ, నెలన్నరరోజుల్లో పూర్తి చేస్తామని, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులను ఆహ్వానించి ప్రారంభిస్తామని అన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

మేయర్ నందీష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 35,568 అనధికార ప్లాట్లు ఉన్నాయని, వాటిలో 11,423 నివాస స్థలాలు, 5,201 వాణిజ్య స్థలాలు, 265 పారిశ్రామిక స్థలాలు, 18,679 ఖాళీ స్థలాలు ఉన్నాయని తెలిపారు. ఇళ్లు నిర్మించుకోవడానికి అనుమంతులు పొందడంలో సామాన్య ప్రజలకు సమస్యలు ఉండేవని, ప్రభుత్వం అనధికార ఆస్తులకు బి-ఖాతా అందించడానికి చొరువ తీసుకుందన్నారు. బీ-ఖాతా పొందడానికి ఆస్తి రిజిస్టర్డ్ సేల్ డీడ్,డివిజన్ డీడ్ లేదా ప్రభుత్వ సంస్థలు జారీ చేసిన టైటిల్ డీడ్‌లు, 94సీసీ కింద రెవెన్యూ శాఖ జారీ చేసిన టైటిల్ డీడ్, ప్రాంగణం విడుదల లేఖ, ప్రస్తుత సంవత్సరం వరకు రుణ ధ్రువీకరణ పత్రం, ప్రస్తుత సంవత్సరంఆస్తి పన్ను చెల్లింపు రసీదు, యజమాని ఫొటో, ఆస్తి ఫొటో, గుర్తింపు ఫొటో కాపీ సమర్పించాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ స్పీకర్ పి.గాదెప్ప, కమిషనర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ త్యాగరాజు

భారత పౌరసత్వం.. ఓ బాధ్యత..

● ప్రొఫెసర్ సీఎం త్యాగరాజు

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): భారతీయులుగా మనకు లభించిన పౌరసత్వాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రొఫెసర్ సి.ఎం. త్యాగరాజ్ అన్నారు. బుధవారం స్థానిక విజయనగర శ్రీకృష్ణదేవరాయల విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సౌత్ రీజనల్ సెంటర్, హైదరాబాద్(ఐసీఎస్‌ఎస్‌ఆర్-ఎస్ఆర్‌సి), విశ్వ కర్మ విశ్వవిద్యాలయంలోని పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'భారత దేశం 2047' కార్యక్రమంలో భాగంగా రాజ్యాంగ, శాసన, న్యాయ సంస్కరణలు అనే అంశంపై బి.ఆర్.అంబేడ్కర్ సభా భవన్‌లో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వికసిత భారత దేశ అభివృద్ధి కల అందరి బాధ్యత కావాలని, ఈ విషయంపై చాలామంది రాజకీయ విశ్లేషకులు, సమాజ సేవకులు అభివృద్ధివైపు సాగడానికి కృషి చేస్తున్నారన్నారు. దేశ రక్షణ, దేశ నిర్మాణం కోసం ప్రతి భారతీయుడు బాధ్యతగా వ్యవహరిస్తే వికసిత భారతదేశం కల నెరవేడం సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో వీఎస్‌కేయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.మునిరాజు మాట్లాడుతూ భవిష్యత్‌లో భారతదేశ నిర్మాణంలో యువకుల పాత్ర ముఖ్యమైనదన్నారు. విశ్వవిద్యాలయాల విద్యార్థుల భవిష్యత్తు రూపొందించడానికి ప్రామాణికమైన విద్య అవసరమన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి 150మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి ఆవశ్యకతపై అవగాహన కల్పించాలి

● సీఈఓ రాహుల్ శరణప్ప



మాట్లాడుతున్న రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నీటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప సూచించారు. బుధవారం నగరంలోని ఒక ప్రవేట్ హాల్లో గ్రామీణ తాగునీరు, పారిశుధ్య శాఖ, పంచాయతీ సహకారంతో ఫీడ్‌బ్యాంక్ ఫౌండేషన్ నిర్వహించిన జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టు అమలుపై నాలుగు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. పంచాయతీ అధికారులు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు సమగ్ర గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. శిక్షణ పొందిన వ్యక్తులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రాజెక్టు 24/7 అమలయ్యే చర్యలు తీసుకోవాలన్నారు. జేజేఎం పథకం కింద ప్రధాన లక్ష్యం స్వచ్ఛ నీటి సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గ్రామీణ తాగునీరు పారిశుధ్య విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇందూధర్, ఫీడ్ బ్యాంక్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అజయ్‌సిన్హా, తిప్పేస్వామి, ఫీడ్ బ్యాంక్ ఆర్గనైజర్ నందకుమార్, పాల్గొన్నారు.

నకిలీ బంగారంతో బ్యాంకుకు టోకరా

● సిబ్బంది రూ.19 లక్షలు స్వాహా



యాక్సిస్ బ్యాంకు

సిరుగుప్ప, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొందరు బంగారం తాకట్టు పెట్టిన వారి ఖాతాలో నకిలీ బంగారం ఉంచి రూ.19 లక్షలు సిబ్బంది స్వాహా చేసిన సంఘటన యాక్సిస్ బ్యాంకులో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. సిరుగుప్ప తాలుకాలోని బళ్లారి రోడ్డు మార్గంలో యాక్సిస్ బ్యాంకులో భాగవడే గ్రామానికి చెందిన హేమావతి 339.500 గ్రాముల బంగారం తాకట్టు పెట్టింది. అలాగే సిరుగుప్ప పట్టణానికి చెందిన యాసిన్ అనే వ్యక్తి 42 గ్రాములు, టెక్కలకోటకు చెందిన బసవరాజు 4.8 గ్రాముల బంగారం తాకట్టు పెట్టారు. వీరు తాకట్టు పెట్టి ఏడాది గడిచింది. తాకట్టు పెట్టిన వారు ఇంతవరకు అప్పు చెల్లించలేదు. అనుమానం వచ్చిన ఆడిట్ విభాగం వారు దర్యాప్తు చేయగా బ్యాంకు సిబ్బంది కార్తీక్, శ్రీనివాస్, కంసలి రామన్నగౌడలు అసలు బంగారం స్థానంలో నకిలీ బంగారాన్ని ఉంచారు. వీటి విలువ రూ.19 లక్షలు ఉంటుందని, బ్యాంకు అధికారులు తెలిపారు. తాకట్టు పెట్టిన బసవరాజు అనే వ్యక్తి బంగారాన్ని పరిశీలించి తూకం వేయగా ఉన్నదానికంటే తగ్గింది. దీనిపై బ్యాంకు మేనేజర్ సిరుగుప్ప పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సీఐ హనుమంతప్ప ఈ విషయంపై దర్యాప్తు చేపట్టారు.

ధైర్యసాహసాలకు మారుపేరు ఛత్రపతి శివాజీ



శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రవిచెళ్లగుర్కి, ఉపాధ్యాయులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ధైర్యసహసాలకు మారుపేరు ఛత్రపతి శివాజీ అని బళ్లారి జిల్లా యూనిట్ కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. తాలూకాలోని సంజీవరాయన కోట ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతి వేడుకలో చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. 1674లో పటాభిషేకం తర్వాత మరాఠా సమ్రాజ్యాన్ని విస్తరించారన్నారు. మొఘలులతో రాయగడ ఒప్పందం అతని పాలనలోనే జరిగిందన్నారు. విద్యార్థులు శివాజీ ఆదర్శాలను, చాతుర్యాన్ని అలవర్చుకోవాలని ఆయన సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్త నింగమ్మ పాల్గొన్నారు.

కంప్లి: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజు పాల్గొని భావచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రతి ఒక్కరూ శివాజీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. గ్రేడ్-2 తహసీల్దార్ షణ్ముఖప్ప, శిరసుదార రమేష్, తాలుకా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో..

హోసూరు జోన్

ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగించాలి

హోసూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హోసూరు బస్‌స్టేషన్ ముందు, పూల మార్కెట్ సమీపాన ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురి కావడంతో పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమిళనాడు-కర్ణాటక రాష్ట్ర సరిహద్దుకు గేట్‌వే గా ఉన్న పారిశ్రామిక పట్టణమైన హోసూరు ద్వారా 900 కంటే ఎక్కువ బస్సులు రాకపోకలు సాగిస్తాయి. తమిళనాడులోని దక్షిణ, ఉత్తర జిల్లాలకు చెందిన బస్సులతో పాటు ఉత్తరాది రాష్ట్రాల బస్సుల సంచారం కూడా ఉంది. ఇలా హోసూరు బస్‌స్టేషన్ నిత్యం ప్రయాణీకులతో బస్సులతో సందడిగా ఉంటుంది. కృష్ణగిరి-బెంగళూరు జాతీయ రహదారిపై హోసూరు బస్టాండ్ ఎదురుగా ఫ్లైఓవర్ ఉంది. ఉత్తరాది రాష్ట్రాలు, తమిళనాడుల్లోని ఇతర ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనాలు దీనిపై వెళ్తుంటాయి. అలాగే బెంగళూరు, డెంకణీకోట, తళి, జూజూవాడీ, సిప్‌కాట్ నుంచి హోసూరు వైపు వచ్చే బస్సులు పూల మార్కెట్ సమీపంలోని సర్వీస్ రోడ్డుకు వస్తాయి. అలాగే హోసూరు ప్రాంతంలోని కర్మాగారాలకు విడిభాగాలను తీసుకుని వచ్చే భారీ వాహనాలు ఈ సర్వీస్ రోడ్డులో మలుపు తిరిగి బాగలూరు రోడ్డు మీదుగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని పలు నగరాలకు వెళ్తాయి. సర్వీస్ రోడ్డుపై ప్రజలు నడవలేని పరిస్థితి నెలకొంది. కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో సర్వీస్ రోడ్డుకు అనుబంధంగా ఫుట్‌పాత్ నిర్మించారు. అయితే ఫుట్‌పాత్‌పై పెద్ద సంఖ్యలో ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు సమస్య ఏర్పడింది. ప్రత్యేకించి వృద్ధులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రయాణీకులు, పాదచారులకు వీలుగా ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ఫుట్‌పాత్‌పై అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాలు

తగ్గిన ముల్లంగి ధరలు

హోసూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో టమో టా, క్యాబేజీ, బీన్స్, క్యారెట్, వంకాయ, బీట్‌రూట్, ముల్లంగి, కొత్తిమీర, పుదీనా, బచ్చలికూర వంటి అన్ని రకాల కూరగాయలు భారీ ప్రమాణంలో పండిస్తున్నారు. ప్రస్తుతం అంతర పంటగా రాగి పంట సాగు చేస్తున్నారు. తాజాగా కొ న్ని రోజులుగా ముల్లంగి ధర తగ్గడంతో రైతులలో దిగులు నెలకొంది. ఇదివరకు డిమార్ట్ వంటి మాల్స్ కొనుగోలు చేసే వి. అయితే కొన్నిరోజులుగా వీటినుంచి ఆర్డర్‌లు లేకపోవడంతో ధర తగ్గింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సుమారు ప్రస్తుతం మార్కెట్‌లో ముల్లంగి కొనుగోలు చేసే వారు లేకపోవడంతో కిలో రూ.10 నుంచి 12 వరకు విక్రయిస్తుండగా, కొన్ని నెలల క్రితం కిలో రూ.30 నుంచి 40 వరకు ఉండేదన్నారు. కనీస ధర లభించకపోవడంతో నష్టపోతున్నట్టు వాపోయారు.

పశువులతో ట్రాఫిక్‌కు ఇబ్బంది



రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

హోసూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో ప్రధాన రహదారులపై పెద్దసంఖ్యలో గేదెలు, వీధి కుక్కలు, పశువులు సంచరిస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో ఎన్నో ప్రాణనష్టం జరిగేందుకు వీలుందని పలువురు అభిప్రాయపడ్డారు. హోసూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న రోడ్లపై అనేక పశువులు తిరుగుతూ మార్గమధ్యలో విశ్రాంతి తీసుకుంటున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురై ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉంది. ఈ ప్రాంతాల్లో వాహనాలకు అడ్డంగా పశువులు ప్రవేశించడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో అతివేగంతో వచ్చే వాహనాలు సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న వాహనాలు ఒకదానికొక్కటి ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా కార్పొరేషన్ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పథకాల అమలుపై ప్రత్యేక సమావేశం

హోసూరు(కృష్ణగిరి), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నేతృత్వంలోని 'తమిళనాడు ప్రభుత్వం అందరికీ సర్వం అనే ప్రాతిపదికన' పలు పథకాలను అమలు చేస్తోంది. అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం, విద్యుద్దీపాలు, మురుగు కాల్వలు, ఫ్లైఓవర్ నిర్మాణం, తారురోడ్ల మరమ్మతులు తదితర అంశాలపై కలెక్టరేట్‌లో బుధవారం చర్చ జరిగింది. కృష్ణగిరి పంచాయతీ యూనియన్, చొక్కడి పంచాయతీ కుల్లమునియన్ కొట్టాయి నుంచి జంబూత్ రోడ్డు వరకు నాబార్డు ప్రాజెక్టు క్రింద రూ.1.30కోట్లతో, పెరియముత్తూరు పంచాయతీలో అగ్రహారం రోడ్డు వరకు పనులు చేపట్టారు. నాబార్డు ప్రాజెక్టు క్రింద అగసిపల్లి పంచాయతీ యూనియన్ ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.34 లక్షల 23 వేలతో నూతన తరగతి గది భవనం, బెత్తలపల్లి పంచాయతీ యూనియన్ ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.16.82 లక్షలతో కంప్యూటర్ సెంటర్‌ను ప్రారంభించారు. పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రిత్వశాఖ, గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ, ప్రభుత్వ వైద్య కళశాల మరియు ఆసుపత్రి వివిధశాఖలు అమలు చేస్తున్న సంక్షేమాల గురించి చర్చించారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ తరపున ఒక్కొక్కరికి రూ.1.01,800 విలువైన స్కూటర్లను 35 మంది లబ్దిదారులకు పంపిణీ చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సాదనకురళ్, రూరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ప్రోగ్రామ్ డైరెక్టర్ కవిత, జిల్లా అటవీ శాఖ అదికారి బగన్ జెగదీష్ సుధాకర్, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, కో ఆపరేటీవ్ సొసైటీల జోనల్ నటరాజన్ తదితర అధికారులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్